Office : 9440815774 మా ప్రతి అక్షరం – ప్రజల కోసం వ్యవస్థాపకులు : డి. విజయ్ కుమార్

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

APETL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక




ప్రచురణ : చిత్తూరు, తిరుపతి సంపుటి : 02 సంచిక : 70 ఎడిటర్ : కే ఎల్ కృష్ణంరాజు గురువారం 15 అక్టోబర్ 2026 పేజీలు : 4 వెల : 2



### సౌదీలో దాడులు

## వెంటనే ఆపాలి

- ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు'
- భారతీయులకు కేంద్రం అడ్వైజరీ
- హూతీ తిరుగుబాటు దారులు సౌదీలోని పౌర మౌలిక సదుపాయాలపై చేస్తున్న దాడుల్ని భారత్ ఖండించింది
- అక్కడి భారతీయులకు ఎంఈఏ కీలక మార్గదర్శకాలు జారీ



### చైనాతో సంబంధాలు సాధారణ స్థితికి రావాలంటే వాస్తవాధీన రేఖ స్థిరంగా ఉండాలి

- సరిహద్దుల్లో ఎటువంటి అశాంతి చెలరేగినా దానికి పర్యవసానాలు ఉంటాయి
- విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టం
- రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడుల విస్తరణ సరిహద్దు వద్ద శాంతితోనే ముడిపడి ఉన్నాయి

# మోగిన ఎన్నికల నగారా



### 28న కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగరపంచాయతీలకు పోలింగ్

### రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఈమేరకు షెడ్యూల్ విడుదల రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్లు ప్రకటించారు.

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

రాష్ట్రంలో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల సమరం రానే వచ్చింది. స్థానిక సమరానికి సంబంధించిన పూర్తి ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా విడుదల చేశారు. ఈ రోజు నుంచే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై, డిసెంబరు 2వ తేదీ వరకు సుదీర్ఘంగా కొనసాగనుంది. 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలతో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ, మూడు విడతలుగా పంచాయతీ ఎన్నికలకు ముహూర్తం ఖరారైంది. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్లు ప్రకటించారు. - మిగతా3లో

## జంతర్‌మంతర్ భారత ప్రజలది

- సీజేపీ నేతల కస్టడీపై విపక్షాలు ఫైర్
- సీజేపీ కార్యకర్తల జైలుకు పంపడంపై విపక్షాల ఆగ్రహం
- యువతను జైలుకు పంపడం పిరికిపంద చర్యగా అభివర్ణించాయి.





### విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు.
అంతరాలయంలో పూజల అనంతరం అర్చకులు రాష్ట్రపతికి వేదాశీర్వచనం
ఆలయ అధికారులు పట్టువస్త్రాలు, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.
సరస్ మేళాలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు



## ఢిల్లీలో అక్టోబర్ 16న 'తిరంగా' నిరసన..

- కొత్త ఆందోళనకు అభిజీత్ దీప్కే పిలుపు..
- సాయంత్రం 5 గంటలకు సెంట్రల్ పార్క్‌లో కార్యక్రమం
- నిరసనకు 'లెహ్రా దో తిరంగా' పేరు..
- సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాల అరెస్టుకు నిరసనగా కార్యక్రమం
- అజింక్య షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల
- స్థానికంగా తిరంగా మార్చ్‌లు నిర్వహించాలని దీప్కే పిలుపు

### 2,721 ఉపాధ్యాయ పోస్టులతో

## నోటిఫికేషన్ విడుదల



ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం మరో అవకాశం 2,721 పోస్టులతో డీఎస్సీ–2026 ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది.

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. 2,721 పోస్టులతో డీఎస్సీ–2026 ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసినట్లు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఇందులో 350 ప్రత్యేక విద్య పోస్టులు ఉన్నాయని ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకూ మెరుగైన విద్య, వ్యక్తిగత శ్రద్ధ అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. దరఖాస్తుల స్వీకరణ ఆన్‌లైన్‌లోనే ఉంటుందని కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తామని లోకేశ్? వెల్లడించారు. డీఎస్సీ - మిగతా3లో



### దేశ సాంస్కృతిక వారసత్వానికి అంతర్జాతీయంగా గుర్తింపు పెరుగుతోంది

- అక్టోబర్ 14 నుంచి 16 వరకు ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరుగుతున్న 'బృహత్తర భారత్
- ప్రపంచవ్యాప్తంగా భారతదేశ సాంస్కృతిక సంబంధాలపై అంతర్జాతీయ సదస్సు'ను ఉద్దేశించి పంపిన సందేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

### స్థానిక ఎన్నికల్లో పోటీపై టీడీపీ, జనసేన

# చర్చలు సఫలం

- 2 రోజుల్లో జాబితా
- స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై సీఎం చంద్రబాబుతో జనసేన నేతల సమావేశం
- ఎన్నికల్లో పోటీపై టీడీపీ, జనసేన చర్చలు సఫలమయ్యాయని ఎమ్మెల్యే బొలిశెట్టి తెలిపారు.
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిగానే పోటీ చేస్తున్నాం
- బలంగా ఉన్నచోట గెలవాలని చంద్రబాబు చెప్పారు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

స్థానిక ఎన్నికల్లో కూటమి సీట్ల సర్దుబాటు పంచాయితీకి తెరపడింది. మేయర్ పీఠాల దగ్గర మొదలైన చర్చలు అభ్యర్థుల ప్రకటన దిశగా చేరాయి. సీట్ల కోసం కొట్టుకుంటున్నారన్న సంకేతాలు ఇవ్వకుండా ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా కూటమి పార్టీల నేతలు సర్దుబాటు చేసుకున్నారు. సీఎం చంద్రబాబుతో జనసేన నేతల సమావేశం ముగిసింది. ఈ సందర్భంగా చంద్రబాబుకు జనసేన నేతలు ధన్యవాదాలు తెలిపారు. భేటీ - మిగతా3లో

# రేణిగుంటలో సందు దారి వివాదం..

**ఏడేళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్య**

**సమస్య పరిష్కరించాలని తహసీల్దార్‌కు స్థానికుల వినతి**



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 14 :**
రేణిగుంట మండలంలోని రామకృష్ణాపురం లో గల సర్వే నంబర్ 462/6కు సంబంధించిన ప్లాట్ ప్రాంతంలో ఉన్న 10ఐ64 అడుగుల సందు దారిపై గత ఏడేళ్లుగా వివాదం కొనసాగుతోందని స్థానికులు చెబుతున్నారు. ప్లాట్ నంబర్ 128 సమీపంలోని సందు దారిని ఆక్రమించి ప్రహరీ నిర్మించడంతో సమస్య మరింత జటిలమైందని వారు పేర్కొంటున్నారు. ఈ విషయంపై రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు వాపోతున్నారు. తాజాగా ఈ సమస్యపై స్పందించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సంబంధిత అధికారులు స్థలాన్ని పరిశీలించి, అందుబాటులో ఉన్న భూ రికార్డులను ధ్రువీకరించి, నిబంధనల ప్రకారం సందు దారి వివాదాన్ని పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఏడేళ్లుగా కొనసాగుతున్న సమస్యకు అధికారులు చొరవ తీసుకొని పరిష్కారం చూపాలని కోరారు. ఈ అంశాన్ని రాజకీయ కోణంలో చూడకుండా, స్థానికుల సమస్యగా పరిగణించి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### యానాది గిరిజన కాలనీల్లో
# మూడు రోజుల వైద్య శిబిరాలు

**పీఈఎస్ ఆసుపత్రి సహకారంతో 389 మందికి వైద్య పరీక్షలు**




**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 14:**
యానాది గిరిజన కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రోప్స్ సంస్థ ఆధ్వర్యంలో పలమనేరు, బైరెడ్డి పల్లి మండలాల్లోని దేవలంపేట, దొడ్డిపల్లి, తిమ్మయ్య గారిపల్లి గిరిజన కాలనీల్లో మూడు రోజులపాటు వైద్య శిబిరాలు నిర్వహించారు. పీఈఎస్ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరాల్లో మొత్తం 389 మంది గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. రోప్స్ సంస్థ చైర్మన్ డాక్టర్ కె.ధనశేఖరన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాల్లో పిల్లలు, మహిళలు, వృద్ధులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. వివిధ ఆరోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించడంతోపాటు, అవసరమైన వారికి వైద్య సలహాలు, చికిత్స అందించారు. తదుపరి పరీక్షలు, చికిత్స అవసరమైన వారికి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా రోప్స్ సంస్థ కార్యక్రమాల నిర్వాహకులు డాక్టర్ పౌలురాజ్ మాట్లాడుతూ, గ్రామీణ, గిరిజన ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయడంలో పీఈఎస్ ఆసుపత్రి సహకారం కీలకమని పేర్కొన్నారు. గిరిజన కుటుంబాల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి శిబిరాలు దోహదపడతాయని తెలిపారు. పీఈఎస్ ఆసుపత్రి సామాజిక వైద్య విభాగాధిపతి మాట్లాడుతూ, గిరిజన కుటుంబాల ఆరోగ్య స్థితిగతులను మెరుగుపరిచి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ శిబిరాల్లో 45 మంది ప్రత్యేక వైద్యులు పాల్గొని సేవలందించారు. రోప్స్ సంస్థ కార్యక్రమ అధికారులు, గ్రామాల సామాజిక విద్యావేత్తలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రాజరాజేశ్వరి దేవిగా ఆరిమాని గంగమ్మ దర్శనం



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 14:**
ఎస్ఆర్ పురం మండలం తయ్యూరు పాయకట్టు ఇలవేల్పు శ్రీ ఆరిమాని గంగమ్మ తల్లి దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని రాజరాజేశ్వరి దేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు వెంకట చలపతి ఆచార్యులు సుప్రభాత సేవ, అభిషేకం నిర్వహించగా, వేద పండితులు గణపతి హోమం, కలశార్చన, మహాభిషేకం, షోడశ పూజలు చేశారు. పిల్లిగుండ్లపల్లికి చెందిన సోమినేని విమల, సోమినేని గోవర్ధన్ నాయుడు, హారతి లోకేష్, విద్యా, మహేష్ ఆధ్వర్యంలో సుమారు 1,500 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. అన్నదాతలను ఆలయ చైర్మన్ జలంధర్ నాయుడు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ వెంకటరమణయ్య, సభ్యుడు అమృత చందు, కాపు సంఘం అధ్యక్షుడు సిద్ధయ్య శెట్టి, పైనేని ధనుంజయ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం మున్సిపల్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల

**28న పోలింగ్.. 30న ఓట్ల లెక్కింపు**

**నామినేషన్ల స్వీకరణకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు**



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 14:**
కుప్పం మున్సిపాలిటీలో ఎన్నికల సందడి మొదలుకానుంది. మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు 32 వార్డుల కౌన్సిలర్ల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ మేరకు మున్సిపల్ ఎన్నికల అధికారి, కమిషనర్ వి. శ్రీనివాసరావు ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 19న నామినేషన్ల పరిశీలన, 21న ఉపసంహరణ ప్రక్రియ నిర్వహించి, అదే రోజు తుది అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. ఈ నెల 28న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుండగా, అవసరమైతే 29న రీపోలింగ్ నిర్వహించనున్నారు. 30న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. నామినేషన్ల స్వీకరణకు కుప్పం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. చైర్‌పర్సన్ పదవికి ఒక కేంద్రం, వార్డుల వారీగా కౌన్సిల్ హాల్‌తో పాటు మొదటి అంతస్తులోని దక్షిణ, ఉత్తర గదుల్లో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల ప్రక్రియను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అభ్యర్థులు ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ నామినేషన్లు దాఖలు చేయాలని అధికారులు సూచించారు.

## కుప్పం మున్సిపల్ చైర్మన్ పీఠంపై ..
# రాజ్‌కుమార్ గురి!








- పార్టీ కోసం పోరాటం..
- కష్టకాలంలో కార్యకర్తలకు అండ..
- అవకాశం ఇస్తే పట్టణ అభివృద్ధికి కృషి

**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్,అక్టోబర్14:**
కుప్పం మున్సిపల్ చైర్మన్ పదవిపై తెలుగుదేశం పార్టీలో ఆశావహుల చర్చ కొనసాగుతున్న నేపథ్యంలో మాజీ జడ్పీటీసీ, ప్రస్తుత కుప్పం మున్సిపల్ టీడీపీ అధ్యక్షుడు ఎస్. రాజ్‌కుమార్ తన అభ్యర్థిత్వంపై ఆసక్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశిస్తే చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన స్పష్టం చేస్తున్నారు. పార్టీ కోసం సుదీర్ఘకాలంగా పనిచేసిన అనుభవం, కష్టకాలంలో కార్యకర్తలకు అండగా నిలిచిన నేపథ్యాన్ని తన బలంగా పేర్కొంటున్నారు.

**రెండు దశాబ్దాలుగా పార్టీతో అనుబంధం**

2004 నుంచి టీడీపీ కార్యకర్తగా, బూత్ ఏజెంట్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన రాజ్‌కుమార్, అనంతరం కుప్పం పాతపేట ఏరియా ఇన్‌చార్జిగా, చిత్తూరు జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శిగా పనిచేశారు. 2014లో కుప్పం మండల జడ్పీటీసీగా పోటీ చేసి విజయం సాధించారు. 2014--2019 మధ్య పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ప్రజలకు అందుబాటులో ఉన్నానని ఆయన తెలిపారు.

**పార్టీ కష్టకాలంలోనూ వెన్నంటి..**

2019లో టీడీపీ అధికారం కోల్పోయిన తర్వాత కుప్పంలో పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ కార్యకర్తల్లో ధైర్యం నింపేందుకు కృషి చేసినట్లు రాజ్‌కుమార్ పేర్కొన్నారు. అప్పటి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించిన నిరసనలు, ధర్నాలు, ఇతర పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నానని తెలిపారు. ఆ సమయంలో తనపై కేసులు నమోదయ్యాయని, జైలు జీవితం కూడా అనుభవించానని వివరించారు. పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయి నుంచి మున్సిపల్ పరిధి వరకు విస్తరించడంలో భాగస్వామినయ్యానని చెప్పారు.

**2024 ఎన్నికల్లో సమష్టి కృషి**

సభ్యత్వ నమోదు, ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి, బాబు ష్యూరిటీ--భవిష్యత్తుకు గ్యారంటీ, శంఖారావం, నిజం గెలవాలి, సూపర్ సిక్స్ వంటి కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులను సమన్వయం చేసినట్లు రాజ్‌కుమార్ తెలిపారు. 2024 ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పనిచేసి కుప్పం మున్సిపల్ పరిధిలో పార్టీకి మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేశామని పేర్కొన్నారు.

**అవకాశం కల్పిస్తే అభివృద్ధికి ప్రాధాన్యం**

పార్టీ పదవుల కోసం ఎప్పుడూ పట్టుబట్టలేదని, అధిష్ఠానం అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించడమే తన లక్ష్యమని రాజ్‌కుమార్ అన్నారు. మున్సిపల్ చైర్మన్‌గా అవకాశం కల్పిస్తే పట్టణంలో మౌలిక సదుపాయాల మెరుగుదల, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం వంటి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తానని స్పష్టం చేశారు. కుప్పం మున్సిపల్ చైర్మన్ పదవికి రిజర్వేషన్, అభ్యర్థిత్వంపై తుది నిర్ణయం వెలువడాల్సి ఉండటంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో రాజ్‌కుమార్ తన రాజకీయ అనుభవం, పార్టీకి అందించిన సేవలను ప్రస్తావిస్తూ అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. అయితే తుది అభ్యర్థి ఎవరనేది పార్టీ నిర్ణయం తర్వాతే స్పష్టత రానుంది

# శ్రీకాళహస్తిలో ఎన్నికల కోడ్ అమలు

- 24 గంటల్లో రాజకీయ పార్టీల బ్యానర్లు, పోస్టర్లు తొలగించాలి
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు
- మున్సిపల్ కమిషనర్ కె.వి. కృష్ణారెడ్డి



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 14:**
శ్రీకాళహస్తి రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన నేపథ్యంలో శ్రీకాళహస్తి మున్సిపాలిటీ పరిధిలో అక్టోబర్ 14 నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ కె.వి. కృష్ణారెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ నియమావళి అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వారి మద్దతుదారులు, ప్రజలు ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. 24 గంటల్లో రాజకీయ ప్రచార సామగ్రి తొలగింపు మున్సిపాలిటీ పరిధిలో బహిరంగ ప్రదేశాలు, రహదారులు, వీధి కూడళ్లు, విద్యుత్ స్తంభాలు, బస్టాండ్లు, ప్రభుత్వ భవనాల ప్రహరీ గోడలు, ఇతర ప్రభుత్వ ఆస్తులపై అనుమతి లేకుండా రాజకీయ పార్టీలకు సంబంధించిన బ్యానర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీలు, గోడ రాతలు, కటౌట్లు, జెండాలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయరాదని కమిషనర్ స్పష్టం చేశారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల బ్యానర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీలు, జెండాలను సంబంధిత రాజకీయ పార్టీలే 24 గంటల్లోగా, అంటే అక్టోబర్ 15లోపు స్వచ్ఛందంగా తొలగించాలని ఆదేశించారు. పార్టీలు వాటిని తొలగించడంలో విఫలమైతే మున్సిపాలిటీ సిబ్బందే తొలగిస్తారని, ఇందుకు అయ్యే ఖర్చును సంబంధిత పార్టీల నుంచి వసూలు చేస్తామని హెచ్చరించారు. నిబంధనల ఉల్లంఘనలను జిల్లా ఎన్నికల అధికారి, రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులపై ప్రచారానికి అనుమతి లేదు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం కలిగించరాదని కమిషనర్ సూచించారు. దేవాలయాలు, మసీదులు, చర్చిలు, పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలపై రాజకీయ ప్రచార సామగ్రిని ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారం కోసం ప్రభుత్వ వాహనాలు, ప్రభుత్వ భవనాలు, ప్రభుత్వ సిబ్బందిని వినియోగించరాదని తెలిపారు. ప్రభుత్వ నిధులతో కొత్త పథకాలు, గ్రాంట్లు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టరాదని పేర్కొన్నారు. సభలు, ర్యాలీలకు ముందస్తు అనుమతి తప్పనిసరి. బహిరంగ సభలు, ఊరేగింపులు నిర్వహించాలన్నా, లౌడ్‌స్పీకర్లను వినియోగించాలన్నా స్థానిక పోలీసు, మున్సిపల్ అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని కమిషనర్ సూచించారు. అనుమతి పొందిన సమయ పరిమితుల్లోనే కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో రాజకీయ పార్టీల ప్రతినిధులు మున్సిపల్ అధికారులకు సహకరించాలని కోరారు. నిబంధనల ఉల్లంఘనలను తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. ఎన్నికల కోడ్‌కు సంబంధించిన అనుమతులు, ఇతర వివరాల కోసం కార్యాలయ పని వేళల్లో శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ కార్యాలయాన్ని సంప్రదించాలని కె.వి. కృష్ణారెడ్డి సూచించారు.

# ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- ప్రజలు, వ్యాపారులు, రాజకీయ నాయకులు అప్రమత్తంగా ఉండాలి
- వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరిక



**శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 14:**
శ్రీకాళహస్తి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పట్టణ ప్రజలు, వ్యాపారులు, రాజకీయ పార్టీల నాయకులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దీపావళి వేడుకలను ఎన్నికల కోడ్ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించుకోవాలని కోరారు. రాజకీయ పార్టీలు సభలు, సమావేశాలు నిర్వహించాలంటే ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. దుకాణదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, సరుకుల దిగుమతులను రాత్రి 9 గంటల తర్వాతే చేపట్టాలని సూచించారు. పట్టణంలోని కొన్ని మెడికల్ షాపుల్లో నిషేధిత మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉందని సీఐ తెలిపారు. ఇలాంటి కార్యకలాపాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. యువత భవిష్యత్తును దెబ్బతీసే మత్తు పదార్థాలను విక్రయించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నారని సీఐ వెల్లడించారు. ఎన్టీఆర్ నగర్‌లో జరిగిన హత్యాయత్నం కేసులో ఇప్పటికే 12 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. మహిళల భద్రత కోసం ఆంధ్రప్రదేశ్ పోలీసులు 'ఆపరేషన్ త్రిశూల్' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మహిళల రక్షణతోపాటు సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. మహిళలకు ఎక్కడైనా వేధింపులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. వేధింపులకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. ముఖ్యంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కొందరు సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఉద్యోగాల పేరుతో వచ్చే నకిలీ ప్రకటనలు, ఫోన్ కాల్స్, సందేశాలను నమ్మి డబ్బులు చెల్లించి మోసపోవద్దని హెచ్చరించారు. ప్రజలు చట్టాలను గౌరవిస్తూ పోలీసులకు సహకరించాలని, పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సీఐ వెంకటేశ్వర్లు కోరారు.

చదవండి.. చదివించండి చిత్తూరు ఎక్స్‌ప్రెస్

# మోగిన ఎన్నికల నగారా

-మొదటిపేజీ తరువాయి

పురపాలక (మున్సిపల్) ఎన్నికల షెడ్యూల్ : రాష్ట్రంలోని 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాల్టీలు, 10 నగర పంచాయతీలకు అక్టోబరు 28న పోలింగ్ నిర్వహించనున్నారు.
నామినేషన్ల దాఖలుకు తుది గడువు: అక్టోబరు 18
నామినేషన్ల పరిశీలన: అక్టోబరు 19
నామినేషన్ల ఉపసంహరణ: అక్టోబరు 21
పోలింగ్ తేదీ: అక్టోబరు 28
ఫలితాలు: అక్టోబరు 30

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్ : పరిషత్ పోరుకు సంబంధించి ఈ నెల 19వ తేదీన నోటిఫికేషన్ విడుదల కానుంది. నవంబరు 3న పోలింగ్, 5న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.
ఎన్నికల నోటిఫికేషన్: అక్టోబరు 19
నామినేషన్ల దాఖలుకు తుది గడువు: అక్టోబరు 23
నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు: అక్టోబరు 27
పోలింగ్ తేదీ: నవంబరు 3
ఫలితాల వెల్లడి: నవంబరు 5

## Local Body Elections 2026

మూడు విడతల్లో పంచాయతీల సమరం : గ్రామ పంచాయతీలకు 3 విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. నవంబరు 26, 29, డిసెంబరు 2వ తేదీల్లో పోలింగ్ నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు.

మొదటి విడత :
నోటిఫికేషన్: నవంబరు 13
నామినేషన్ల దాఖలుకు తుది గడువు: నవంబరు 17
నామినేషన్ల ఉపసంహరణ గడువు: నవంబరు 21
పోలింగ్ తేదీ: నవంబరు 26

రెండో విడత :
నోటిఫికేషన్: నవంబరు 18
నామినేషన్ల దాఖలుకు తుది గడువు: నవంబరు 20
నామినేషన్ల ఉపసంహరణ గడువు: నవంబరు 24
పోలింగ్ తేదీ: నవంబరు 29

**మూడవ విడత :**
నోటిఫికేషన్: నవంబరు 19
నామినేషన్ల దాఖలుకు తుది గడువు: నవంబరు 23
నామినేషన్ల ఉపసంహరణ గడువు: నవంబరు 27
**పోలింగ్ తేదీ: డిసెంబరు 2**

మొత్తంగా ఈ రోజు నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి ఉండనుంది. షెడ్యూల్ విడుదల కావడంతో ప్రధాన రాజకీయ పార్టీలు అప్రమత్తమయ్యాయి. అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలపై కసరత్తులు చేస్తున్నాయి.

# పులివెందుల వైసీపీ అభ్యర్థి వైఎస్ ప్రమీల



**కడప :** ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల నగారా మోగిన వేళ, రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. తన సొంత అడ్డా పులివెందులకు అభ్యర్థిని ఖరారు చేశారు. పులివెందుల మున్సిపల్ చైర్‌పర్సన్ వైయస్‌ఆర్‌సీపీ అభ్యర్థిగా వైఎస్ మనోహర్ రెడ్డి సతీమణి వైఎస్ ప్రమీలమ్మ పేరును జగన్ అధికారికంగా ప్రకటించారు. ఈ సారి కుటుంబసభ్యులకు కాకుండా బయట వారికి చాన్సిస్తారని ప్రచారం జరిగినా.. అలాంటి ధైర్యం చేయలేకపోయారు.మనోహర్ రెడ్డి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరుడు మనోహర్ రెడ్డి.. జగన్‌కు బాబాయ్ వరుసవుతారు. అటు జగన్ సతీమణి వైఎస్ భారతిరెడ్డి వైపు నుంచి కూడా వీరికి బలమైన కుటుంబ బాంధవ్యాలు ఉన్నాయి. దాదాపు మూడు దశాబ్దాలుగా పులివెందుల స్థానిక రాజకీయాలు, గ్రామీణ పంచాయతీల నుంచి మున్సిపాలిటీ వరకు అంతా మనోహర్ రెడ్డి కనుసన్నల్లోనే నడిచేది. వైఎస్సార్ హయాం నుంచే స్థానిక సంస్థల పెత్తనాన్ని గుత్తాధిపత్యంగా నడిపిస్తున్న ఆయన.. జగన్ కేంప్ కార్యాలయం, భారతి వ్యవహారాల్లోనూ తెరవెనుక కీలక చక్రం తిప్పుతూ వచ్చారు.పులివెందుల పురపాలక సంఘం చరిత్రను తిరగేస్తే.. ఈ దంపతుల చేతుల్లోనే స్థానిక అధికారం దశాబ్దాలుగా బందీ అయిందన్నది బహిరంగ రహస్యం. గతంలోనూ వైఎస్ ప్రమీలమ్మ పులివెందుల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. భర్త మనోహర్ రెడ్డి చక్రం తిప్పుతుంటే, భార్య ప్రమీలమ్మ చైర్‌పర్సన్ కుర్చీలో కూర్చుని నామమాత్రపు పాలన సాగించేవారు. మున్సిపాలిటీలో పనుల కేటాయింపులు, స్థానిక కాంట్రాక్టులు, వార్డుల నిర్వహణ అన్నీ వీరి కనుసన్నల్లోనే సాగాయి . పులివెందుల మున్సిపాలిటీలో నిజమైన ప్రజాస్వామిక ప్రాతినిధ్యం గానీ, కొత్త నాయకత్వానికి అవకాశం గానీ దక్కలేదు. పార్టీలో ఏళ్ల తరబడి జెండాలు మోసి, కేసులు ఎదుర్కొన్న సామాన్య కిందిస్థాయి కార్యకర్తలకు ఎప్పుడూ కార్పొరేటర్ లేదా వార్డు మెంబర్ టికెట్లే మిగిలాయి తప్ప.. కీలకమైన చైర్‌పర్సన్ కుర్చీ మాత్రం మళ్లీ తిరిగి ప్రమీలమ్మ ముంగిట్లోనే వాలింది.కడప ఎంపీగా అవినాష్ రెడ్డి, అసెంబ్లీలో జగన్, ఇప్పుడు మున్సిపాలిటీలో బాబాయ్ భార్య ప్రమీలమ్మ.. ఇలా స్థానిక నుంచి పార్లమెంట్ దాకా అధికారం అంతా నాలుగు గోడల మధ్యే ఉండాలన్న జగన్ ఆధిపత్య మనస్తత్వాన్ని ఈ నిర్ణయం ప్రతిబింబిస్తోంది. గత సార్వత్రిక ఎన్నికల్లో పులివెందులలోనే మెజారిటీ గణనీయంగా తగ్గిపోయి సొంత గడ్డపైనే పట్టు సడలిన సంకేతాలు కనిపించినప్పటికీ.. జగన్ మాత్రం కనీస మార్పునకు సిద్ధపడలేదు.ఈ సారి ప్రత్యక్ష ఎన్నిక కావడంతో .. టీడీపీ బలమైన మహిళా అభ్యర్థిని నిలిపే అవకాశం ఉంది.

# విశాఖ మేయర్ పీఠంపై తెరపైకి బాలయ్య కూతురి పేరు



**విశాఖపట్నం :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో విశాఖపట్నం మేయర్ పదవికి ప్రత్యేక గుర్తింపు ఉంది. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, నగర ప్రాధాన్యం, భారీ బడ్జెట్ కారణంగా ఈ పదవిని దక్కించుకోవాలని రాజకీయ నాయకులు ఆసక్తి చూపుతుంటారు. తాజాగా మేయర్ పదవికి మహిళా రిజర్వేషన్ ఖరారైనట్లు ప్రచారం జరగడంతో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. అధికార కూటమితో పాటు వైఎస్సార్‌సీపీ కూడా బలమైన అభ్యర్థుల కోసం అన్వేషిస్తున్నట్లు చర్చ సాగుతోంది. ముఖ్యంగా టీడీపీకి చెందిన ప్రముఖ కుటుంబాల మహిళల పేర్లు తెరపైకి రావడం ఆసక్తిని పెంచుతోంది.విశాఖ మేయర్ పదవి మరోసారి మహిళకు దక్కనుండటంతో మహిళా నాయకుల మధ్య పోటీ పెరిగే అవకాశం కనిపిస్తోంది. 2021లో జరిగిన మేయర్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున బీసీ వర్గానికి చెందిన గొలగాని హరి వెంకట కుమారి బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు కూడా మహిళా అభ్యర్థికే అవకాశం ఉండటంతో పార్టీలు సామాజిక సమీకరణాలు, రాజకీయ బలాబలాలను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది.

ఈ క్రమంలో నందమూరి తేజస్విని పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఆమె సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ రెండో కుమార్తె. విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ సతీమణి కూడా. రాజకీయంగా ప్రభావం ఉన్న కుటుంబానికి చెందిన ఆమెను మేయర్ అభ్యర్థిగా నిలబెట్టవచ్చనే ప్రచారం సాగుతోంది. గతంలో భీమిలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2029 ఎన్నికల్లో పోటీ చేస్తారనే ఊహాగానాలు కూడా వినిపించాయి. అయితే మేయర్ పదవికి పోటీ చేసే విషయంలో ఆమె ఆసక్తి, పార్టీ నిర్ణయం ఏమిటన్నది ఇంకా స్పష్టతకు రాలేదు. ఆమె పేరు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చకు పరిమితమైంది.మరోవైపు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ సతీమణి లావణ్య పేరు కూడా వినిపిస్తోంది. ఆమెకు అవకాశం దక్కుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది. విశాఖ టీడీపీ అధ్యక్షుడు పట్టాభిరాం సతీమణి పేరును కూడా కొందరు ప్రస్తావిస్తున్నారు. జనసేన నుంచి పెద్దిశెట్టి ఉషశ్రీ, ఉత్తర నియోజకవర్గానికి చెందిన ఉషా కిరణ్ పేర్లు చర్చలో ఉన్నాయి. బీజేపీ నుంచి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కుటుంబానికి చెందిన మహిళ పోటీ చేస్తారా అన్నది కూడా రాజకీయ వర్గాల్లో ఆసక్తిని కలిగిస్తోంది.వైఎస్సార్‌సీపీ తరఫున మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ సతీమణి బొత్స ఝాన్సీ పేరు వినిపిస్తున్నప్పటికీ, ఆమె పోటీపై స్పష్టత లేదు. పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కళ్యాణి పేరు కూడా ప్రచారంలో ఉంది. మాజీ ఎమ్మెల్యేల కుటుంబాల నుంచి కొత్త అభ్యర్థులు తెరపైకి వచ్చే అవకాశాలనూ కొట్టిపారేయలేం.మొత్తంగా విశాఖ మేయర్ పీఠం కోసం ప్రధాన పార్టీల్లో ఇప్పటి నుంచే కసరత్తు మొదలైనట్లు కనిపిస్తోంది. అయితే ప్రచారంలో ఉన్న పేర్లలో ఎవరికి పార్టీలు అవకాశం కల్పిస్తాయన్నది అధికారిక ప్రకటనల తర్వాతే తేలనుంది. సామాజిక సమీకరణాలు, రాజకీయ పలుకుబడి, స్థానిక నాయకుల మద్దతు ఈ ఎంపికలో కీలకంగా మారే అవకాశం ఉంది.

## ధర్మానకు శీల పరీక్ష.. !

**శ్రీకాకుళం :** ఉత్తరాంధ్ర జిల్లాల్లోని కీలకమైన శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వైసిపి ఏ విధంగా ముందుకు సాగుతుంది?. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ విధంగా ఫలితాన్ని తెచ్చుకుంటుంది? అనేది ఆసక్తిగా మారింది. కీలక మైన నాయకుడిగా గుర్తింపు పొందిన ధర్మాన ప్రసాదరావుకు ఈ ఎన్నిక ఒకరకంగా శీల పరీక్ష పెడుతుందనే వాదన బలంగా వినిపిస్తోంది. ప్రధానంగా గత రెండున్నర ఏళ్ల కాలంలో వైసిపి తరఫున శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో పెద్దగా కార్యక్రమాలు ఏవి చేపట్టలేదు.కార్యకర్తలతో మాస్ స్పీచ్ ఒక్క కార్యక్రమంలో మాత్రమే ధర్మాన ప్రసాదరావు పాల్గొన్నప్పటికీ బలమైన ముద్రనైతే వేయలేకపోయారు. కానీ, పార్టీ పరంగా ధర్మాన తర్వాత ఇంకెవరూ లేరు అనే మాట వినిపిస్తున్న నేపథ్యంలో ఆయన శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో ఏ విధంగా పార్టీని గెలుపు దిశగా అడుగులు వేసేలా చేస్తారు అన్నది ప్రశ్న. ప్రధానంగా కూటమిక్కడ బలంగా పనిచేస్తుంది. శ్రీకాకుళం నియోజకవర్గ కావచ్చు శ్రీకాకుళం జిల్లాలో కావచ్చు మొత్తంగా టిడిపి జనసేన ల ప్రభావం భారీగా కనిపిస్తోంది. – ఈ క్రమంలో బలమైన కూటమి పక్షాలను ఎదుర్కొని ఇక్కడ వైసిపి పాగా వేయాలి అంటే ధర్మాన ఇంతకు నాలుగింతల కృషి చేయాల్సిన పరిస్థితి ఉంది. ఈ ఎన్నికల్లో ధర్మాన గెలుపు దిశగా అడుగులు వేస్తే తప్ప వచ్చే ఎన్నికల నాటికి ఆయన ఇమేజ్ బలపడడంతో పాటు ఆయన ఓటు బ్యాంకు పెరిగే అవకాశాలు కూడా తక్కువగానే ఉన్నాయని అంటున్నారు. ఇప్పటికిప్పుడు పరిస్థితిని చూస్తే కూటమికే శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో అనుకూలమైన వాతావరణం ఉంది. మాజీ ఎమ్మెల్యే గుండా లక్ష్మీదేవి కార్పొరేషన్ మేయర్ సీటు కోసం తీవ్ర స్థాయిలో ప్రయత్నం చేస్తున్నారు. దీనిని టిడిపికే కేటాయిస్తే గుండె లక్ష్మీదేవి విజయం సాధించడం సునాయాసం అవుతుంది అన్న వాదన కూడా వినిపిస్తోంది. ఇక వ్యక్తిగతంగా లక్ష్మీదేవికి ఉన్న మెజారిటీ మహిళా ఓటు బ్యాంకు మాజీ ఎమ్మెల్యేగా ఆమెకు ఉన్న గుర్తింపు కుటుంబ పరంగా ఉన్న ఇమేజ్ వంటివి కూడా కలిసి వస్తాయని అంటున్నారు. ఇవన్నీ దాటుకుని వైసీపీని ఇక్కడ గెలిపించడం కార్పొరేషన్ లో పాగా వేయటం అనేది ధర్మానకు శిల పరీక్షగా మారనుందని తెలుస్తోంది. మరి ఏం చేస్తారనేది చూడాలి.

## 2,721 ఉపాధ్యాయ పోస్టులతో నోటిఫికేషన్ విడుదల

-మొదటిపేజీ తరువాయి

సిలబస్‌ను ఇప్పటికే వ2ంం౩.ఖజూ౩టంం.అఅ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని నవంబర్ 3 లోగా పూర్తి స్థాయి నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

**జాబ్ క్యాలెండర్ ప్రకారం**
ఏటా డీఎస్సీ ప్రకటిస్తామని ఇచ్చిన హామీలో భాగంగా మంగళవారం రాత్రి డీఎస్సీ ప్రాథమిక (షార్ట్) నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్, పురపాలక పాఠశాలల్లో 2,111 ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులు 350, సొసైటీల్లో ప్రిన్సిపల్, పీజీటీ, టీజీటీ, పీడీ, పీఈటీ పోస్టులు 260 కలిపి మొత్తం 2,721 ఉద్యోగాల భర్తీకి మూడు వేర్వేరు నోటిఫికేషన్లు విడుదల చేసింది. నవంబరు 3 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తారు. దరఖాస్తుల స్వీకరణకు ముందే పాఠశాల విద్యాశాఖ పూర్తి స్థాయి నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. ఇందులో ఖాళీలు, రిజర్వేషన్లు, అర్హతల పూర్తి వివరాలను ప్రకటిస్తుంది. సాధారణ పోస్టులతో పాటు ఈసారి ప్రత్యేక విద్య టీచర్ ఖాళీలను భర్తీ చేయనున్నారు. మొదట ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ప్రకారం ఈ నెల 15న నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉండగా స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతున్నందున రెండు రోజులు ముందుగానే ప్రాథమిక నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది.

**కర్నూలులో 404 ఖాళీలు**
సాధారణ, ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులతో కలిపి అత్యధికంగా కర్నూలు జిల్లాలో 404 ఖాళీలు ఉన్నాయి. ఆ తర్వాత ప్రకాశంలో 291, వైఎస్సార్ కడపలో 227 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయనున్నారు. అత్యల్పంగా పార్వతీపురం మన్యంలో 15, విజయనగరంలో 18, పశ్చిమగోదావరిలో 20 పోస్టులు ఉన్నాయి.
సొసైటీలు, ఇతర యాజమాన్యాల్లో మొత్తం 260 పోస్టులున్నాయి. అందులో సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యా సంస్థల సొసైటీలో ఉన్నవి 85 ఖాళీలు.
ప్రిన్సిపల్ పోస్టులు మల్టీ జోన్ కాగా పీజీటీ, టీజీటీ జోనల్ పోస్టులు. ఆదర్శ పాఠశాలల్లో టీజీటీ పోస్టులను జోన్ పరిధి పోస్టులుగా ఇటీవల స్థానిక కేడర్‌లో ప్రభుత్వం పేర్కొంది.

## ప్రీమియం హోండాలో దసరా–దీపావళి ధమాకా ఆఫర్లు

**రూ.10 వేల క్యాష్‌బ్యాక్.. రూ.4,999కే డౌన్‌పేమెంట్‌తో వాహనం**




**హిందూపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 14:** పండుగ సీజన్‌ను పురస్కరించుకుని హిందూపురం పెనుకొండ రోడ్డులో ఆర్టీసీ బస్టాండ్ పక్కన ఉన్న ప్రీమియం హోండా షోరూంలో దసరా–దీపావళి ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉన్నాయని మేనేజర్ శ్రీధర్ తెలిపారు. షోరూం యాజమాన్యం ప్రసాద్ రెడ్డి, నారాయణ రెడ్డి నేతృత్వంలో కస్టమర్లకు పలు రాయితీలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఆఫర్లలో భాగంగా రూ.10 వేల క్యాష్‌బ్యాక్, అదనంగా రూ.5 వేల వరకు ప్రత్యేక డిస్కౌంట్, ఫైనాన్స్‌పై వాహనం కొనుగోలు చేస్తే ఉచితంగా ఫుల్‌ట్యాంక్ పెట్రోల్, ప్రతి కొనుగోలుపై బహుమతి అందిస్తున్నట్లు వివరించారు. రూ.4,999 డౌన్‌పేమెంట్‌తో వాహనం కొనుగోలు చేసే అవకాశం ఉందన్నారు. పాత వాహనాల మార్పిడిపై ఎక్స్ఛేంజ్ బోనస్, రెఫరల్ బోనస్‌తో పాటు స్పాట్ ఫైనాన్స్, స్పాట్ ఎక్స్ఛేంజ్, స్పాట్ డెలివరీ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఈ పండుగ ఆఫర్లను సద్వినియోగం చేసుకోవాలని శ్రీధర్ కోరారు.

## బొమ్మల కొలువులోం కూష్మాండ దేవి అలంకరణలో అమ్మవారు

**జ్ఞానప్రసూనాంబ సన్నిధిలో భక్తులకు దివ్యదర్శనం**
**వైభవంగా కొనసాగుతున్న దేవీ నవరాత్రి ఉత్సవాలు**



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 14:** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి ఆలయంలో జ్ఞానప్రసూనాంబ అమ్మవారి గర్భాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన ప్రత్యేక బొమ్మల కొలువు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బొమ్మల కొలువు వేదికపై అమ్మవారిని నాలుగో రోజు అలంకారమైన కూష్మాండ దేవి రూపంలో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. సృష్టికి మూలకారణమైన ఆదిశక్తి స్వరూపిణిగా కూష్మాండ దేవిని భక్తులు ఆరాధి స్తారు. అమ్మవారిని ఈ రూపంలో దర్శించుకుంటే సకల శుభాలు కలిగి, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం. కూష్మాండ దేవి అలంకరణలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు స్థానిక భక్తులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి యాత్రికులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. జ్ఞానప్రసూనాంబ అమ్మవారి సన్నిధిలో బొమ్మల కొలువు మధ్య కొలువుదీరిన అమ్మవారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకుని భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. దేవీ నవరాత్రుల సందర్భంగా ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేపట్టారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎంపీ పార్థసారథి



**హిందూపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 14:** హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి బుధవారం పలు శుభకార్యాల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. రొద్దం మండలం సానిపల్లి గ్రామానికి చెందిన చోలేమర్రి నరసింహప్ప కుమార్తె వివాహానికి పైడేటి సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానంలో హాజరయ్యారు. అనంతరం పైడేటి గ్రామంలో ఎంపీ నిధులతో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవస్థానం పనులను పరిశీలించి, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం రాప్తాడు నియోజకవర్గం కనగానపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు నాగభూషణ కుమారుడి వివాహానికి అనంతపురంలోని డీఆర్ కన్వెన్షన్ హాల్‌లో హాజరై వధూవరులను ఆశీర్వదిం చారు. ఈ కార్యక్రమాల్లో మాజీ జెడ్పీటీసీ నంజుండప్పతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్‌తో బాధిత కుటుంబానికి

**రూ.1.35 లక్షల ఆర్థిక సాయం**

**ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చొరవతో కే. లక్ష్మికి ఊరట**



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 14:**
శ్రీకాళహస్తి అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పట్టణంలోని 32వ వార్డుకు చెందిన కే. లక్ష్మి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.1,35,000 ఆర్థిక సాయం అందింది. స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చొరవతో ఈ సాయం మంజూరైంది. కే. లక్ష్మి అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చేరగా, శస్త్రచికిత్సకు లక్షల రూపాయలు ఖర్చవుతుండటంతో ఆమె కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంది. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.1.35 లక్షల ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ సాయంతో బాధిత కుటుంబానికి కొంత ఆర్థిక ఊరట లభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు కష్టం వచ్చినప్పుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెద్ద కొడుకులా అండగా నిలుస్తున్నారని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వేల నుంచి లక్షల రూపాయల వరకు ఆర్థిక సాయం అందిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రజలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆనందంగా జీవించగలరని, కష్టపడి తమ జీవితాలను సఫలం చేసుకోగలరని అన్నారు. ఆరోగ్యవంతమైన సమాజంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్, 32వ వార్డు ఇన్‌చార్జి పోలూరు శ్రీనివాసులు రెడ్డి, బూత్ కన్వీనర్ ఎస్.కె. షాబుద్దీన్, బూత్ కో-కన్వీనర్ తారాక్షి లోకేష్ ఆచారి, పట్టణ ఆర్గనైజింగ్ సెక్రటరీ పాలపర్తి యశ్వంత్, ఐటీడీపీ నాయకుడు తారాక్షి రేవంత్‌తో పాటు 32వ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు, పాల్గొన్నారు.

# గంగాధర నెల్లూరులో బీసీలకు అన్యాయం: తులసి యాదవ్

**ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ రిజర్వేషన్లపై వైసీపీ నేత అభ్యంతరం**



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 14:**
గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో బీసీలకు రిజర్వేషన్ల కేటాయింపులో అన్యాయం జరిగిందని పాలసముద్రం మండల వైసీపీ అధ్యక్షుడు తులసి యాదవ్ ఆరోపించారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీలకు 36 శాతం రిజర్వేషన్లు కల్పించామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆ మేరకు ప్రాధాన్యం లభించడం లేదన్నారు. పాలసముద్రం మండలంలో బీసీ ఓటర్లు 35 నుంచి 40 శాతం వరకు ఉన్నప్పటికీ ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ పదవులను బీసీ లకు కేటాయించకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని, రిజర్వేషన్ల విషయంలో న్యాయం చేయాలని తులసి యాదవ్ డిమాండ్ చేశారు.

# పలమనేరు మున్సిపాలిటీలో 36 వార్డుల గెలుపే లక్ష్యం

**కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలి**

**అభ్యర్థుల ఎంపికపై పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి సమీక్ష**




**పలమనేరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 14:**
పలమనేరు మున్సిపాలిటీలోని 36 వార్డులకు కూటమి అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి పార్టీ నాయకులు,ముఖ్య కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. బుధవారం పట్టణంలోని టీడీపీకార్యాలయంలో జరిగిన సమావేశంలో వార్డులవారీగా పార్టీ బలా బలాలు,స్థానిక రాజకీయ పరిస్థితులు, పోటీకి ఆసక్తి చూపుతున్న ఆశావహుల వివరాలను పరిశీలించారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగి,స్థానిక సమస్యల పై అవగాహనతో పనిచేసే నాయకులకు అభ్యర్థుల ఎంపికలో ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే వివరించారు. ఆశావహుల జాబితాలను పార్టీ శ్రేణుల నుంచి స్వీకరించి,వార్డుల వారీగా సమీక్షించారు. అభ్యర్థుల ఎంపిక విషయంలో పార్టీ నాయకులు వ్యక్తిగత అభిప్రాయాలకు అతీతంగా వ్యవహరించి, పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని సూచించారు. కూటమి నాయకుల మధ్య సమన్వయం, కార్యకర్తల ఐక్యతతో ఎన్నికల కార్యాచరణను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అయితే,అభ్యర్థుల ఎంపికకు సంబంధించి తుది నిర్ణయం తీసుకునే అధికారిక విధానం లేదా నిర్దిష్ట ప్రమాణాలను సమావేశంలో ప్రకటించినట్లు సమాచారం లేదు.

# దేవస్థానం నిధుల వినియోగంపై సమగ్ర విచారణ జరపాలి

**రూ.77 లక్షలతో తాత్కాలిక షెడ్ల నిర్మాణంపై అంజూరు తారక శ్రీనివాసులు అభ్యంతరం**

**సామాన్య భక్తులకు ఉపయోగపడేలా నిర్మాణాలను మార్చాలి**

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 14:**



శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానం నిధుల వినియో గంపై సమగ్ర విచారణ జరపాలని మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు డిమాండ్ చేశారు. దేవాలయం నాలుగో నంబర్ గేటు వద్ద రూ.77 లక్షలతో తాత్కాలిక రేకుల షెడ్లు నిర్మించ డంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం శాశ్వత మండపాలు నిర్మించాల్సి ఉండగా, తాత్కాలిక నిర్మాణాలు చేపట్టడం వల్ల నిధుల సద్వినియోగం ప్రశ్నార్థకంగా మారిం దని పేర్కొన్నారు. గతంలో నిర్మించిన కొన్ని షెడ్లు, బుకింగ్ కౌంటర్లు నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని భక్తులకు ఉపయోగపడేలా ఉచిత డార్మిటరీలుగా మార్చాలని సూచించారు. సామాన్య భక్తులకు అందుబాటులో ఉండే రూ.500 రాహు-కేతు పూజలను కొనసాగించాలని కోరారు. దేవస్థానం అధికారులు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి నిధుల వినియోగంపై పారదర్శకతకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రజాసేవకు అంకితమైన అధికారిపై

# సోషల్ మీడియాలో ప్రశంసల వెల్లువ!

- ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వికాస్ మర్మత్ ఐఏఎస్ పనిచేస్తున్నారంటూ ప్రచారం..
- సేవా దృక్పథానికి మద్దతుగా నెటిజన్ల స్పందన

**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 14:**
ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారుల బాధ్యత, ప్రజల పట్ల వారి స్పందన ఎలా ఉండాలనే అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. కుప్పం ప్రాంత అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంతో ముడిపడి ఉన్న కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కాడా) పీడీ వికాస్ మర్మత్ ఐఏఎస్‌ను ప్రశంసిస్తూ రూపొందించిన బ్యానర్ ప్రస్తుతం ప్రజల దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రజల సమస్యలను వినడం, వాటి పరిష్కారానికి చొరవ చూపడం, అధికార యంత్రాంగంపై ప్రజలకు నమ్మకం కల్పించడం వంటి అంశాలను ఈ ప్రచార చిత్రంలో ప్రధానంగా ప్రస్తావించారు.

**పదవి కంటే ప్రజాసేవకే ప్రాధాన్యం?**

అధికారుల పనితీరును వారి హోదాతో కాకుండా, ప్రజలకు అందుబాటులో ఉండటం, సమస్యలపై స్పందించడం, పరిష్కారానికి తీసుకునే చర్యల ఆధారంగా అంచనా వేయాలనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. ఈ నేపథ్యంలో వికాస్ మర్మత్ పేరుతో వెలువడిన ప్రచార బ్యానర్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వడం, చిన్న సమస్యనైనా నిర్లక్ష్యం చేయకుండా పరిశీలించడం, ప్రజలకు న్యాయం జరిగేలా కృషి చేయడం వంటి అంశాలను ప్రస్తావించారు.

**సోషల్ మీడియా ప్రచారం.. బాధ్యతాయుత చర్చకు వేదిక**

ఒక అధికారిని ప్రశంసించడం కేవలం వ్యక్తిగత అభిమానం వరకే పరిమితం కాకుండా, ప్రజలకు అందుబాటులో ఉండే పాలనకు ప్రోత్సాహకంగా మారాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు. అయితే, సోషల్ మీడియాలో ప్రచారమయ్యే ప్రశంసలతో పాటు క్షేత్రస్థాయిలో పరిష్కారమైన సమస్యలు, అమలైన అభివృద్ధి పనులు, ప్రజలకు అందిన సేవలను కూడా పరిశీలించడం అవసరం. ప్రజా సేవలో పారదర్శకత, జవాబుదారీతనం, సమయపాలన వంటి అంశాలే అధికారుల పనితీరుకు అసలైన కొలమానాలు.

**ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగాలి**

కుప్పం ప్రాంత ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పుడు సత్వర స్పందన లభించాలని, ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరాలని, అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తికావాలని ఆశిస్తున్నారు. ఈ దిశగా అధికారులు ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ, ఫిర్యాదుల పరిష్కారంలో పురోగతిని వెల్లడిస్తే ప్రభుత్వ యంత్రాంగంపై విశ్వాసం మరింత పెరుగుతుంది. వికాస్ మర్మత్ ఐఏఎస్‌కు మద్దతుగా రూపొందించిన #WeStandWithVikasMarmati IAS అనే సందేశం కూడా ప్రజా సేవలో బాధ్యతాయుతమైన పనితీరుకు మద్దతుగా నిలవాలనే భావనను ముందుకు తెస్తోంది. అయితే, బ్యానర్‌లో వ్యక్తమైన ప్రశంసలు ప్రచారంలో భాగంగా ఉన్నందున, వాటిని స్వతంత్రంగా నిర్ధారించిన వాస్తవాలుగా కాకుండా ప్రజా స్పందనలో భాగంగా చూడాలి. అంతిమంగా, ఏ అధికారి పట్ల ప్రజల్లో గౌరవం నిలవాలన్నా మాటలకంటే చేతల్లో కనిపించే సేవ, సమస్యల పరిష్కారంలో ఫలితాలు, ప్రజల పట్ల బాధ్యతాయుతమైన వ్యవహార శైలే కీలకం. ప్రజల అవసరాలను గుర్తించి, పారదర్శకంగా పనిచేసే అధికారులకు సమాజం నుంచి సహజంగానే మద్దతు లభిస్తుంది.




# "మీసేవలు బంద్.. ప్రజలకు ఇబ్బందులు!"

- "సేవల పునరుద్ధరణకు ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు నిర్వాహకుల వినతి"

**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 14:**
మీసేవ, ఏపీ సేవ కేంద్రాల ద్వారా ప్రజలకు అందించే పలు కీలక సేవలు నిలిచిపోవడంతో సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మరోవైపు ఈ కేంద్రాలపై ఆధారపడి జీవిస్తున్న నిర్వాహకుల ఉపాధి దెబ్బతింటోందని మీసేవ నిర్వాహకుల సమైక్య సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. నిలిచిపోయిన సేవలను తక్షణమే పునరుద్ధరిం చేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి సమ స్యను తీసుకెళ్లాలని కోరుతూ ఎమ్మెల్సీ, కుప్పం ప్రాంత అభి వృద్ధి సంస్థ అధ్యక్షుడు కంచర్ల శ్రీకాంత్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల పునర్జారీ, పట్టాదారు పాస్‌పుస్తకాల పునర్ముద్రణ, నీటి పన్నుల చెల్లింపు లు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల కోసం



తిరగాల్సి వస్తోందని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అంతర్జాల సేవలపై అవగాహన తక్కువగా ఉన్న వారు ఇబ్బందులు పడుతున్నారని, అనధికార వెబ్‌సైట్లు, అపరిచిత లింకులను ఆశ్రయిస్తే మోసాలకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**ప్రజలకు ఇబ్బందులు.. నిర్వాహకులకు ఉపాధి దెబ్బ**

ప్రభుత్వ గుర్తింపు పొందిన మీసేవ కేంద్రాల ద్వారా సేవలు అందుబాటులో ఉంటే ప్రజలకు సౌకర్యంతో పాటు భద్రత కూడా ఉంటుందని ప్రతినిధులు పేర్కొన్నారు. సేవలు నిలిచిపోవడంతో కేంద్రాల నిర్వాహకులు ప్రధాన ఆదాయాన్ని కోల్పోతున్నారని, ఈ వృత్తిపై ఆధారపడిన అనేక కుటుంబాల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారిందని వివరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న మనమిత్ర సేవలతోపాటు మీసేవ, ఏపీ సేవ అంతర్జాల వేదికల్లో నిలిచిపోయిన అన్ని సేవలను తిరిగి ప్రారంభించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ఎమ్మెల్సీ శ్రీకాంత్‌ను కోరారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, ప్రజలకు సేవలు అందుబాటు లోకి తీసుకురావడంతోపాటు మీసేవ నిర్వాహకులకు ఉపాధి భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గానికి చెందిన మీసేవ కేంద్రాల నిర్వాహకులు శ్రీనివాసమూర్తి, శంకర్, మంజునాథ్, సత్యవేలు, గిరి తదితరులు పాల్గొన్నారు.

**రూ.50 వేల సాయంతో**

# మహిళకు స్వయం ఉపాధి



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 14:**
మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో కృష్ణదాసనపల్లి పంచాయతీ పరిధిలోని వరమునూరు గ్రామానికి చెందిన లక్ష్మమ్మకు అదానీ గ్రూప్ తరఫున రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ మొత్తంతో ఏర్పాటు చేసిన చిల్లర దుకాణాన్ని బుధవారం ప్రారంభించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అర్హులైన పేద కుటుంబాలకు స్వయం ఉపాధి కల్పించే కార్యక్రమంలో భాగంగా లక్ష్మమ్మను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సహాయం ఆమె కుటుంబానికి స్థిరమైన జీవనోపాధి కల్పించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజగోపాల్, మణి, మహేంద్రబాబు, కనకరాజు, సరవణ, జేకే సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ కార్యాలయం ప్రారంభం..

**101 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ**



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 14:**
గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని వెదురుకుప్పం మండల కేంద్రంలో నూతన టీడీపీ కార్యాలయాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం.థామస్ ప్రారంభించారు. మండల పార్టీ అధ్యక్షుడు గురుసాల కిషన్ చంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన 101మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం ఆర్‌ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటరీ టీడీపీ అధ్యక్షుడు చెక్కుడుకుప్పం షణ్ముఖ రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్, పలువురు మండల పార్టీ అధ్యక్షులు, జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# పేద కుటుంబాలకు అండగా సీఎంఆర్‌ఎఫ్

**28 మంది లబ్ధిదారులకు రూ.20.94 లక్షల ఆర్థిక సాయం**



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 14:**
శ్రీకాళహస్తి బుధవారం శ్రీకాళహస్తి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు జి. విజయ్ కుమార్ నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) ద్వారా ఆర్థిక భరోసా కల్పించారు. శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణానికి చెందిన 28 మంది లబ్ధిదారులకు రూ.20,94,644 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. వైద్య ఖర్చులు భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా 28 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.20,94,644 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో తోడ్పాటునందిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, కూటమి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# డీఎస్పీ పావనిని కలిసిన కాంగ్రెస్ నేతలు

**బాలికల కళాశాల వద్ద ఆకతాయిల ఆగడాలు అరికట్టాలని వినతి**

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 14:**



శ్రీకాళహస్తి సబ్‌డివిజన్ నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పావనిని కాంగ్రెస్ నాయకులు తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తలపా దామోదరంరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రి సమీపం లోని బాలికల జూనియర్ కళాశాల వద్ద ఆకతాయిల ఆగడాలు అధికంగా ఉన్నాయని డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే, స్వర్ణముఖి కట్ట ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని వివరించి, వాటిని అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.దీనిపై డీఎస్పీ పావని సానుకూలంగా స్పందిస్తూ, సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, జిల్లా ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సుధా యాదవ్, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆంటోనీ, నాగరాజు, మహేష్, అరుణ్, చరణ్, జోసెఫ్, సారధి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

Edited Printed Published & Owned by K.L Krishnam Raju. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 19/86-1, Jaya Prakash Road, Kuppam, Chittoor District, Andhra pradesh. EDITOR K.L.KRISHNAM RAJU, RNI. NO. APTEL/2023/86143